
# సిల్కులాల్చీ

**—హనుమంతు అన్నం నాయుడు**

**సాయంత్రం ఆరుగంటలు కావొస్తోంది. చంటి పిల్లడి చేతిలోని బిస్కట్‌లా శీతాకాలవు చీకటి. వెలుగును నంజుకు తింటోంది. బరంపురం రైల్వే స్టేషన్‌లో రెండవ నంబర్ ప్లాట్‌ఫారం జనంతో కిటకిటలాడుతోంది.**



గుంటూరులో వున్న మాతమ్ముడు అర్జంటుగా రమ్మని టెలిగ్రాం పంపితే అప్పటికప్పుడు బయల్దేరాము నేను. ఆవిణ్ణి కూడా రమ్మంటే రిజర్వేషన్ లేకపోతే నేను రాలేను బాబు! మీరు వెళ్లిరండి అంది అప్పుడనిపించలేదు గాని ప్లాటుఫారమ్మీద జనాన్ని చూశాక అనిపించింది. మా ఆవిడ నిర్ణయం కరక్టేనని!

ఐదు గంటలకు రావలసిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా చమటలు కక్కుకుంటూ అపరాధిలా వచ్చి ఆగింది. జనంలో కోలాహలం మొదలైంది. రిజర్వేషన్ చేయించుకున్నవారు తమ బోగి నంబర్లను వెదుక్కుంటు పరుగిడుతుంటే లేనివారు బెర్తులు కోసం స్లీపరు కొచిల్లోంచి దిగిన వల్లకోటులను చుట్టుముట్టి వలిపేస్తున్నారు.

భుజమ్మీద ట్రంకు పెట్టెల్లని పెట్టుకొని చేతి నించి సామాన్లతో ముందు వెనుక చూడకుండా ఎదురుగా వస్తున్న తలకాయాల్ని టప్-టప్ మని గుద్దుకుంటూ జనరల్ కంపార్టు మెంట్ను వేపు పరుగులు తీస్తున్నారు. సూరత్ వెళ్లే లేబరు పార్టీలు!

మీద పడుతున్న ప్రయాణీకుల్ని తప్పించుకుంటూ నోరూమ్ అంటూగట్టిగా అరుస్తూ కసురుకుంటు న్నారు. స్లీపర్ కోచ్ కండక్టర్లు!

గంపడు పిల్లల్ని కన్న ఓ ఆడకుక్క డస్ట్‌బిన్ పక్కన తన పిల్లలకు పాలుకుడుపుతుంది. ఉన్న రొమ్ములు చాలక, శుష్కించిన రొమ్ముల్లోంచి పాలు రాక, కుక్కపిల్లలు కుంయ్! కుంయ్! మంటూ తెగ గోల చేస్తున్నాయి. అదే పనిగా ఒట్టిపోయిన రొమ్ముల్ని పట్టి చీకుతుంటే సహనం నశించిన తల్లికుక్క నిర్దాక్షణ్యంగా పిల్లల్ని వెనక్కినెట్టి నా పక్కనుంచి ముందుకు పరుగుతీసింది!

నాకు బెర్తు దొరికే అవకాశం కనుచూపుమేరలో కనిపించడంలేదు. జనరల్ కంపార్టుమెంట్నులో ఊకపోస్తే రాలనంత జనం- స్లీపరు కోచీల్లో 'నోరూమ్' ప్రహసనం!

నరసింహం అని నాకు తెలిసిన టి.టి.ఇ. ఒకాయ మున్నాడు. గతసారి ఫ్యామిలీతో తిరుపతి వెళ్లినప్పుడు ఆయనే రిజర్వేషను చేయించి చాలా సహాయం చేశాడు. ఈ రోజు ఆయన శలవులో వున్నారట!

ఆఖరు ప్రయత్నంగా యస్- ఫైవ్ కోచ్ దగ్గరకు వెళ్లాను. విజయవాడ-రాజమండ్రి కోటాల్లో ఏమైనా బెర్తులు దొరుకుతాయేమోనని! అక్కడ జనం గుమిగూడి వున్నారు. ఏదో గొడవ జరుగుతోంది! దగ్గరగా వెళ్లాను. ఓ లావుపాటాయన టి.టి.ఇ.తో గొడవ పడుతున్నాడు. ఎర్రంచు జరీ వున్న పొందూరు పాటినూలు పంచె, దానిపై తెల్లటి సిల్కులాల్చీతో ఆ లావుపాటాయన చిన్న సైజు విలేజి లెవెల్ నాయకుడిలా కనిపిస్తున్నాడు.

"ఎన్నిసార్లు చెప్పాలండీ! బెర్తులు ఖాళీ లేవని!" విసుక్కుంటూ కసురుతున్నాడు టి.టి.ఇ!

"ఎన్నిసార్లయినా చెప్పాలండీ! అది మీ డ్యూటీ! యూఆర్ పబ్లిక్ సర్వెంట్!" కళ్లెర్రజేసి అంటున్నాడు సిల్కులాల్చీ.

"అసలింతకీ మీ ఉద్దేశ్యం ఏమిటి? నాతో గొడవపెట్టుకోడానికే వచ్చారా? ఇందాకటి నుంచి చూస్తున్నాను ఒకటే కాకిగోల! ఛీ! ఛీ! మెల్లగా చెప్తితే వినరు. గట్టిగా చెప్తితే కోపాలు!" విసురుగా కంపార్టుమెంటు ఎక్కి దభేలున డోరు వేసేసుకున్నాడు టి.టి.ఇ.

బండి బయలుదరడానికి సూచనగా డిపార్చర్ బెల్ కొట్టాడు టోకెన్ పోర్టరు. చేసేదిలేక పక్కనే వున్న జనరల్ కంపార్టుమెంటు లోకి దూరాను నేను. ఈ పని ముందు చేసినా బాగుండేది! మరో మార్గం లేక నా వెనకే అనుసరించాడు సిల్కులాల్చీ.

మునుపట్లా జనరల్ టికెట్ పట్టుకొని స్లీపరు కోచ్‌ల్లో ఎక్కలేం! ఒకవేళ ఎక్కితే యాభై రూపాయలు ఫైనుతో స్లీపరుచార్జి వసూలు చేసి తరువాత వచ్చే స్టేషనులో దిగిపొమ్మంటున్నారు.

ట్రైను నెమ్మదిగా బయలుదేరింది. నిలబడేందుక్కూడా చోటులేదు. ట్రంకు పెట్టెల్ని తప్పించుకుంటూ ముందుకు నడిచాను.

"నమస్కారం మాస్టారు!" డోరు పక్కనున్న సింగిల్ సీటులో కూర్చున్న వ్యక్తిలేచి నిలబడి సవినయంగా పలకరించాడు. పరిశీలనగా చూశాను. అతనెవరో గుర్తుకు రావటంలేదు. ప్రతి నమస్కారం చేస్తూ "మీరు..." నామాట పూర్తి కాకుండానే "నేను మాస్టారూ! రాంబాబుని! మీ స్టూడెంటుని! కాశిబుగ్గ హైస్కూల్లో నేను సెవెన్త్ క్లాసు చదువుతున్నపుడు మీరు మా క్లాస్ టీచర్! బహుశా మీరు గుర్తుపట్టలేరు లెండి" నవ్వుతూ

అన్నాడు.

ఎప్పుడో పాతికెళ్లనాటి మాట!!పొట్టివిక్కరు, ఇంకు మరకల చొక్కాతో భుజమ్మీద పుస్తకాల సంచితో చూసిన వ్యక్తి గడ్డం- మీసాలుతో వుంటే ఎలా పోల్చుకోగలము?

"అలాగా! ఇప్పుడేం చేస్తున్నావు బాబు?" అన్నాను. 'మంచేశ్వర్ వర్క్‌షాపులో పనిచేస్తున్నాను సార్! రండి మాస్టారు నా సీట్లో కూర్చోండి! నేనెలాగు ఇచ్ఛాపురంలో దిగిపోతాను."

అంటూ సీటుమీదున్న తన చేతి రుమాలు తీసి,నన్ను కూర్చో బెట్టాడు.అప్పటికే నాపక్కన నిలబడి వున్న సూరత పాసెంజరు ముద్ది పోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఏదో పెద్దరికం నిలబెట్టాడు. గురుశిష్యుల అనుబంధాన్ని ఈ విధంగా నిరూపించుకున్నాడు. లేకపోతే తెల్లవార్లు ఒంటికాలు మీద జపం చేసేవాణ్ణి!

ఇచ్ఛాపురం వచ్చింది. దేవుడు పంపిన నా శిష్యుడు దిగివెళ్తూ 'వస్తాను మాస్టారూ'అంటూ మరోసారి అభివందనం చేశాడు.

'చాలా థ్యాంక్స్ బాబు!'కృతజ్ఞతగా అన్నాను. బండి బయలుదేరింది. సిల్కులాల్చి నిలబడి కొరకొరా చూస్తున్నారు.

సీటు దొరికింది గదా!సావకాశంగా కూర్చొని బ్యాగ్‌లోంచి ఆరోజు పేపరు తీసి చదవడం మొదలుపెట్టాను. నా ఎదురు సింగిల్ సీట్లో వయసు మళ్లిన ఇద్దరు భార్యాభర్తలు కాబోలు సర్దుకొని కూర్చున్నారు. వేషభాషలు–వాలకం చూస్తుంటే అద్దుక్కుతినే వాళ్లలాగ కనిపిస్తున్నారు. పొందికగా అల్లి ఈతలేకుల చాప చుట్టచుట్టి సీటు పక్కన పెట్టి,దాని మీద ఆనపకాయతో చేసిన వీణలాంటి పరికరం వుంచారు. వాటి పక్కనే సొట్టలుపడి వల్లగా వున్న సిల్వరు గిన్నెలు–తపేలాలు కలిపికట్టిన మూట వుంది.

ముసలాయిన తలపాగా సందులోంచి సగం కాల్చి ఆర్పేసి వుంచిన చుట్టను తీసి వెలిగించాడు. కుడి చేత్తో చుట్టను గుండ్రంగా లిప్పతూ గుప్పగుప్పన పొగ వదులుతున్నాడు.

గాలి కెదురుగా కూర్చున్నానేమో! ఆపొగంతా నాముఖం మీదకే వచ్చి వుడుత్తుంది. ఘాటైన ఆవాసనకు నాకడుపులో దేవేసి నట్టవుతుంది. ఇది చాలదన్నట్టు ముసల్ది భొద్దుకొంగులో దాచుంచుకున్న చుట్టతీసి వెలిగించి అడ్డపొగ పెట్టింది.

సరిగ్గా ఆసమయంలో చిరబిగిసి సల్చున్న సిల్కులాల్చీ కళ్లు వీళ్లమీద పడ్డాయి.

'ఒరేయ్!ఏంట్రా ఈ చుట్టకంపు!అసలే ఊపిరాడక ఛస్తున్నాం! చుట్టతీసి అవతల పారెస్తావాలేదా?'పులిలాగ వచ్చి వాళ్లమీద పడ్డాడు సిల్కులాల్చి.

పిడుగు లాంటి ఆకేకకు జడుసుకున్న ముసలాయన చప్పన చుట్టను కిటికీలోంచి అవతలకు విసిరేసి తుపుక్కున ఉమ్మాడు. న్యూస్ పేపరు ముఖాని కడ్డంగా వుంది గాబట్టి సరి పోయింది. లేకపోతే ఆ లాలాజలమంతా వచ్చి నాముఖానికి పన్నీరులా పావనం చేసుండేది! ముసలి నోట్లోంచి గబుక్కున చుట్టుతీసి నేలమీద ఇటూ–అటూ రాసి తిరిగి బొడ్డు కొంగులో పెట్టుకొంది.

'బళ్లల్లో తిరిగేది చాలక మళ్ళీ కూర్చోడానికి సీటొకటి కావాలి వీళ్ల మొహాలకి! సీటు కాళీచెయ్!'గయ్‌మంటూ హుకుం జారీచేశాడు సిల్కులాల్చి. 'నేను సెప్పలేదా' కిందకూకుందామంటే ఒప్పి నావు కావు! యిప్పుడునూడు ఆ పెద్ద బాబు గోరికి కోపమొచ్చినాది. పెద్దోల్లదగ్గిరి అట్టుగెక్కి కూకోవద్దంటే ఈ ముసిలి గొరకడు ఇనదు గదా' ముసలాయన్ని తిట్టుకుంటూ సీటు కాళీ చేసి సామాన్లు డోరు దగ్గరకు తీసుకెళ్ళింది ముసల్ది. దాని వెనుకాలే వెళ్లాడు ముసలోడు.

సిల్కులాల్చి దర్జాగా సీటు ఆక్రమించుకున్నాడు. పలాస స్టేషనులో బండి ఆగింది. దిగిన వాళ్లు తక్కువ ఎక్కిన వాళ్లు ఎక్కువ. ఈగోలతో పాటు ఉడుంచర్మంతో అతికించిన డొక్కు డోలు వాయిస్తు పాత సినిమాల్లోని పాటల్ని అపశృతు లొలికిస్తూ పాడుకుంటు అడుక్కుంటున్నాడు ఓ గుడ్డివాడు.

బండి బయల్దేరింది. స్క్వాడ్‌టి.టి.ఇ. ఒకాయన మా కంపార్టుమెంటులోకి ఎక్కాడు. 'మాస్టారూ! జిల్లా ఎడిషన్ ఒక సారిస్తారూ' అంటూ, నేనివ్వకుండానే నా పక్కనున్న పేపరు తీసుకున్నాడు సిల్కులాల్చి 'ఏమిటో పేపరు తిరగేస్తే చాలు ఎక్కడో ఒక చోట కుంభకోణం. దక్షిణాదిన బంగారం. ఉత్తరాదిన గడ్డి' నాతో చెబుతున్నట్టు స్వగతంగా అనుకుంటున్నాడు సిల్కులాల్చి.

టిక్కెట్లు చెక్‌చేస్తూ అటునుంచి వస్తున్నటి.టి.ఇ. త్రోవ కడ్డంగా పెట్టిన మూటకు కాలు తగిలి తూలి పడబోయి నిభాయించుకున్నాడు.

'ఎవడ్రా త్రోవకడ్డంగా మూటపెట్టింది?' అంటూ కాలిబూటుతోమూటను పక్కకు తోసి కోపంతో చిందులేశాడాయన.

'నాదే బాబు' అంటూదూరంగా జరిగిన మూటను దగ్గరకు తీసుకున్నాడు ముసలాయన.

'ఏరా! నిల్చోడానికే చోటులేదు. మధ్యలో నువ్వు నీ వెనక ఆ ముసల్ది. దాని వెనక ఈ లగేజీనూ. చూడూ. మర్యాదగా శ్రీకాకుళంలో దిగండి. లేకపోతే మెడపట్టి గెంటిస్తాను' అన్నాడు.

'బాబ్బాబు.మీకు పున్నెముంతాది. ఇశాకపట్నం దాక ఇక్కడే కూకోనివ్వండి. మాకు కళ్లు కూడ సరీగ్గ కనిపించవు. టిక్కటి కూడ తీసుకున్నాము బాబు' ప్రాధేయపడుతూ కాళ్లు పట్టుకున్నాడు ముసలాయన.

'నువ్వు!... టికెట్ తీశావా! ఏది చూపించు?' కొంచం ఆశ్చర్యపోతు అడిగాడు టిటిఇ. కంటిమెడ బనీను లోపలి జేబులోంచి రెండు టిక్కెట్లు తీసి చూపించాడు ముసలాయన.

టి.టి.ఇ. ముఖకవళకల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం వరకు వున్న ఆ టికెట్లను చూసి నివ్వెరపోయాడాయన. ఎంత అమాయకులు వీరు. వేషభాషలను బట్టి అంచనా వెయ్యడం పెద్ద పొరపాటే. టికెట్స్ తీసికూడ ఎన్ని చీవాట్లు తింటున్నారు. అనవసరంగా వాళ్లని కసురుకున్నందుకు పశ్చాత్తాప మాచనగా 'అవునూ. మీరు భువనేశ్వర్ నుంచి వస్తున్నారు కదా! సీటు దొరకలేదా?' ఏకవచనం నుంచి బహువచనంలోకి వస్తూ నొచ్చుకుంటూ అడిగాడాయన.

'ఒకసీటు దొరికినాది బాబు. అదిగో. ఆ బాబు గోరు మాకు కిందికి తోసేసి కూకున్నారు' అక్కనంతా వెళ్లగక్కుతూ సిల్కులాల్చివేపు చూపించాడు ముసలాయన.

సిల్కులాల్చిలో చలనం మొదలైంది. ఇబ్బందిగా ఇటూ అటూ కదులుతు పేపరులో ముఖం దాచేసుకున్నాడు.

ఆగ్రహోగ్రుడైన టి.టి.ఇ.తిన్నగా సిల్కులాల్చి వద్దకి వెళ్లి 'ఏమయ్యా పెద్ద మనిషి! వాళ్లు చెప్పింది నిజమేనా? నిజమే అయితే మర్యాదగా సీటు కాళీ చేసి వాళ్లని కూర్చోనివ్వండి' శాసించినట్టు అంటూ 'ఏదీ మీ టికెట్ ఒకసారి చూపించండి' అన్నాడు.

'నమస్కారం సార్! వైజాగ్ వరకు వస్తాను. నేను స్టేషను కొచ్చేసరికి ట్రైను వచ్చేసింది. టికెట్ తియ్యడానికి టైం లేకపోయింది. వైజాగ్‌లో మా అల్లుడు కూడ రైల్వే లోనే పనిచేస్తున్నాడు సార్' సంజాయిషి ఇస్తూ నీళ్లు నములుతున్నాడు సిల్కులాల్చి.

తోక తొక్కిన త్రాచులా అంతెత్తున లేచి 'ఓహో! డబ్ల్యూటీనన్నమాట. సిల్కులాల్చికి చింపిరి బనీను కున్న తేడా ఇప్పుడు తెలుసుకున్నాను. మూట యాభైయ్యెనిమిది రూపాయలు కట్టండి. టికెట్ రాసిస్తాను' అన్నాడు టి.టి.ఇ

'ఎందుకు? టికెట్ ఖరీదు అరవై అయిదు రూపాయలేగా! నేను బరంపురం నుంచి వస్తున్నాను' భృకుటి ముడిచి రంగులు మారుతున్న ముఖకవళికల్ని కప్పి పుచ్చుతు అన్నాడు సిల్కులాల్చి.

'మీరు ఎక్కడ నుంచి వచ్చినా ఖుర్దారోడ్ నుంచి చార్జి కట్టాల్సిందే. అది రూలు' అంటూ ఇఎఫ్‌టి పుస్తకం తీసి టికెట్ రాసిచ్చాడు.

మొగుడు కొట్టాడని కాదుగాని ఆడబడుచులు దెప్పినందుకు బాధపడినట్టు, కంపార్టుమెంటులో పాసింజర్లంతా తనవంకే చూస్తుండడంతో అవమానకరంగా ఫీలై డబ్బుకట్టి రశీదు తీసుకొని, అయిష్టంగానే సీటు ఖాళీచేసి యధాస్థానానికి వెళ్లిపోయాడు సిల్కులాల్చి.

శత్రువులుచే రాజ్యం కోల్పోయి అడవులు పాలైన రాజు, తిరిగి రణరంగంలో గెలిచి సింహాసనాన్ని అధిష్ఠించినమహారాజులా ముసలాయన పట్టమహిషిలా ముసల్ది చుట్టకంపుతో మళ్ళీ వచ్చి నా ఎదురు సీట్లో సర్దుకొని కూర్చున్నారు. ముఖం చెల్లక పక్క స్టేషనులో ఆ కంపార్టుమెంటు దిగి మరో పెట్టెలోకి వెళ్లిపోయాడు సిల్కులాల్చి.

'మానవత్వం పరిమళించే మంచి మనసుకు స్వాగతం...

బ్రతుకు అర్థం తెలియజేసిన మంచి మనిషికి స్వాగతం...'

గుడ్డివాడు పాట పాడుకుంటూనా పక్క నుంచి వెళుతున్నాడు.